# యస్.కె.బి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల

స్థాపితం : 1966

నాక్ బి++

మాచర్ల, పల్నాడు జిల్లా.

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 19 Special Issue No. 7 Monthly July 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-


# తెలుగు సాహిత్యం - సామాజికత

## అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

తేదీలు : 29, 30 జులై 2022



నిర్వహణ :

## తెలుగు విభాగం మరియు ఐ.క్యూ.ఎ.సి.

# S.G.A. GOVT. DEGREE COLLEGE


YELAMANCHILI


(Reaccredited by NAAC with 'A' Grade)

## DEPARTMENT OF TELUGU

V A SATYANARAYANA LECTURER IN TELUGU paper'Presented IN International Webinar At SKBR GDC MACHARLA On 30-7-2022










BHAVAVEENA Spl. Issue
Vol. 19, Issue. 7, July 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఆంధ్ర మహాభారతంలో సామాజిక సంక్షేమ అంశాలు

- బి.ఏ. సత్యనారాయణ, తెలుగు అధ్యాపకుడు, శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎలమంచిలి, అనకాపల్లి జిల్లా.

"దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్" అన్నాడు గురజాడ. దేశమంటే మనుషులు - ప్రజలు. ఇలాంటి ప్రజలతో కూడుకున్నదే సమాజం. సమాజంలో ఇద్దరిని మించి ఎంతమందైనా .... (ఎన్ని కోట్లమందయినా) ఉండవచ్చు. కుల మత ప్రాంత వర్గ వర్ణ ప్రాంత భేదాలు కలిగిన వారిగా సమాజంలో ప్రజలు ఉన్నప్పటికీ - పరస్పరం కలసి మెలసి జీవిస్తూ ఒకరికొకరు సహకరించుకొనే స్వభావం సమాజము(ల)ల్లో ఉంటుంది. అందువలన సమాజంలో వర్గాల పరంగా భిన్నత్వం ఉన్నా అందరినీ కలిపి ఉంచే ఏకత్వం ఉన్నప్పుడు ఆ సమాజం జాతిగా, దేశంగా మనగలుగుతుంది. అలా మనగలుగుతున్న జాతుల్లో, దేశాల్లో మన భారతజాతి భారతదేశం ఒకటి.

మానవ నాగరికతలో సంఘజీవితం సంఘర్షణ మయంగా ఉండేది. వివిధ తెగలు విడివిడిగా, కలివిడిగా ఉండి బలమున్న వాడిదే రాజ్యం అన్నట్లుగా ఉండేది. చిన్న చేపను పెద్దచేప మింగే స్థితి కొనసాగేది. క్రమంగా ఈ స్థితి నుంచి మారి బలమున్న వ్యక్తిని తమకు రక్షకుడిగా రాజుగా అంగీకరించే స్థితి వచ్చింది. అలా ప్రజలు రాజు రక్షణలో ఉన్నందుకు వారు అతనికి కావాల్సిన అవసరాలను వివిధ రూపాలుగా సమకూర్చవలసి వచ్చేది. ఈ స్థితి క్రమంగా రాజరికానికి దారితీసిందని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతారు. ఇలా మరింత ముందుకు వెళ్ళిన రాజరిక వ్యవస్థ రాజును దైవాంశసంభూతిడిగా తీర్చి దిద్దింది. మన భారతదేశంలో 'నా విష్ణు పృథివీపతిః' అని రాజును విష్ణుంశ స్వరూపుడిగా పేర్కొన్నారు. రాజు యొక్క ప్రాజ్ఞ నిరంకుశత్వం పేరుతో ఎన్నో రాజ్యాలు మంచిగానో చెడ్డగానో కీర్తిని పొందాయి. హరిశ్చంద్రుడు, రంతిదేవుడు, బలిచక్రవర్తి, శిబి చక్రవర్తుల వంటి వారి గురించి మంచిగా చెప్పుకుంటే హిరణ్యకశిప, హిరణ్యాక్షుల గురించి చెడ్డగా చెప్పుకుంటారు. అయితే వీరందరూ పురాణాదులలో పేర్కొనబడినవారు. పురాణ విషయాలను అంగీకరించే విషయంలో అనేకులకు సందేహాలున్నాయి. పూర్వచరిత్రలుగా పేర్కొనబడే ఇతిహాసాలు రామాయణ భారతాలు. వీటి విషయమై వీటిలో చెప్పబడిన అంశాలపై అనేకులకు సదభిప్రాయములున్నాయి. వాటిలోని చాలా అంశములు వాస్తవమైనవని నమ్ముతున్నారు. ఈ నమ్మకాలు కథాపరంగానే కాకుండా రాజులు ఆచ రించాల్సిన ధర్మాలు, పాటించాల్సిన విధుల గురించి కూడా ఉన్నాయి. రాజు పాటించాల్సిన ధర్మాలలో 'సంక్షేమ విధి' కూడా ఒకటి.

ప్రజాస్వామ్య యుగంలో ప్రజలే పాలకులు. ప్రజల సహకారంతోనే, ప్రజల ఎన్నికతోనే పాలకులు అధికారానికి వస్తారు. ఇలా అధికారానికి వచ్చినవారు సాధారణంగా ఐదేళ్ళపాటు అధికారంలో ఉంటారు. మళ్లీ మరోసారి అధికారంలోనికి రావాలంటే ప్రజామద్దతు ఓట్ల రూపంలో పొందాల్సిందే. లేకపోతే ఎవరైతే ప్రజామద్దతును ఓట్ల రూపంలో పొందుతారో వారు అధికారానికి వస్తారు. కాబట్టి ప్రజాస్వామ్యంలో రాజకీయనాయకులు ప్రజామద్దతును పొందడానికి పలుసంక్షేమ పథకాలను ప్రకటించడం ద్వారా, అమలుచేయడం ద్వారా ప్రజా అభిమానాన్ని పొంది అధికారాన్ని చేజిక్కించుకోవాలనుకుంటారు. నిజానికి దేశంలో ప్రజానీకానికి, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలవారికి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని భారత రాజ్యాంగం పేర్కొంటోంది. భారతరాజ్యాంగం తనకు తానే

సంక్షేమ రాజ్యంగా ప్రకటించుకున్నది. రాజ్యాంగ పీఠిక మరియు ఆదేశిక సూత్రాలలో సంక్షేమ రాజ్యం యొక్క లక్షణాన్ని స్పష్టంగా పొందుపరిచారు.

రాజ్యాంగ నిర్మాతల దృష్టిలో ప్రజలపై ఎటువంటి వివక్ష చూపకుండా అందరినీ సమానంగా గుర్తించాలి, గౌరవించాలి. దురదృష్టవశాత్తు అలాంటి అవకాశం తక్కువ. సమాజంలో పేదగొప్ప, సకలాంగ, వికలాంగ, స్త్రీ, పురుష, బాల, వృద్ధ వంటి భేదాలు మరియు అనాథలు, అభాగ్యులు ఎందరో ఉంటారు. వీరందరినీ మిగతా పౌరుల స్థాయికి తీసుకురావడానికి వారికి వివిధ సామాజిక సంక్షేమ పథకాలను అందిస్తారు. దీనివలన వీరికి కలిగిన దుస్థితుల నుంచి ఉపశమనం పొంది ఆత్మగౌరవం వృద్ధి చెందుతుంది. అందువలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు, అవసరమైన వారికి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటాయి. అయితే ఈ పథకాలలో సామాజిక అవసరాల కన్నా రాజకీయ అవసరాలే ప్రధానం అయిపోయాయన్న అభిప్రాయం ఉంది.

ఈ ప్రజాస్వామ్య యుగంలో ప్రతి వర్గానికీ ప్రభుత్వాలు ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేసి వారి అభిమానాన్ని పొందే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే సంక్షేమం అవసరమైన వ్యక్తులకు ఇతరులు సహాయం చేస్తే అది దానంగా పరిగణించవచ్చు. దీనివలన దానం పొందిన వ్యక్తులకు ఆత్మన్యూనతా భావం కలిగే ఆస్కారం ఉంది. అందువలన ప్రభుత్వాలే ఆయా వర్గాలకు నిర్దిష్ట ప్రాతిపదికల ప్రకారం సహాయం చేస్తే దానివలన వారు ఆత్మగౌరవంతో జీవిస్తారు. ఇదే రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన సంక్షేమం. సంక్షేమ పథకాలను ఎవరికివ్వాలన్న విషయం ఎలా ఉన్నా ముఖ్యంగా దేశరక్షణలో అసువులు బాసిన వీరసైనికుల కుటుంబాలు, దేశానికి అన్నంపెట్టే రైతులు, వాణిజ్యము ద్వారా వస్తుసేవలనందించే వ్యాపారులు, ఇంకా వికలాంగులు, అనాథలు ప్రభుత్వ వ్యవహారాలలో సహకరించే ఉద్యోగులు వంటివారు ముఖ్యులు. ఇలాంటి వారి సంక్షేమం ప్రభుత్వవిధి. ప్రస్తుతం ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఇటువంటి సంక్షేమ పథకాలు ఈ కాలంలోనే ఉన్నాయా? మహాభారత కాలంలో కూడా ఉన్నాయా? అనే అంశాన్ని పరిశీలించినప్పుడు అనేక విషయాలు వెల్లడౌవుతాయి.

నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతం సభాపర్వం ప్రథమాశ్వాసంలో ధర్మరాజు మయసభ ప్రవేశ ఘట్టం ఉన్నది. దాని లోని నారద - ధర్మజ సంవాదంలో రాజనీతికి సంబంధించిన అంశాలతోపాటు ఈ సామాజిక సంక్షేమ విషయాల గురించిన ప్రస్తావన ఉన్నది. ధర్మరాజు తమ్ముళ్ళతో కూడి ఒక శుభ ముహూర్తంలో 'మయసభ' ప్రవేశం చేస్తాడు. ఈ సందర్భంగా వివిధ దేశాల రాజులతో పాటు అనేక మంది మునులు వచ్చి ధర్మరాజును దర్శించుకున్నారు. ధర్మరాజు వారి వారి స్థాయిలను బట్టి అందరినీ ఆదరించాడు. ఇలా ఉండగా ఒక రోజు నారద మహర్షి ధర్మరాజు వద్దకు వచ్చాడు. రాజు ఆచరించవలసిన రాజధర్మములను ఆచరిస్తున్నారా? అని ధర్మరాజును అడుగుతాడు. ఆ సందర్భంలో ఎన్నో ముఖ్యమయిన అంశాలను ప్రస్తావిస్తాడు. వాటిలో సమాజంలో సంక్షేమం పొందాల్సిన వర్గాలు ఉన్నాయి. ఆ విశేషాలను వివరించడమే ఈ "మహాభారతంలో సామాజిక సంక్షేమ పథకాలు" వ్యాస ఉద్దేశ్యం.

## సైనిక సంక్షేమం :

మన దేశ రక్షణకు సైనికులు అవసరం. వీరు మాతృదేశ రక్షణలో ప్రాణాలు విడవడానికి కూడా సందేహించరు. కుటుంబానికి యజమాని అయిన సైనికుడు మరణిస్తే ఆయా కుటుంబాల దుఃఖం వర్ణనాతీతం. అందుకని ప్రభుత్వాలు వారికి పూర్తి స్థాయి భరోసా కల్పించే సంక్షేమ పథకాలను ప్రస్తుతం అమలుచేస్తున్నాయి. ఈ వ్యవస్థ మహాభారతంలో క్రింది విధంగా ఉంది.

రాజు దగ్గర పనిచేస్తున్న ఉద్యోగులలో అనేకులు సైనికులు ఉంటారు. వారు రాజు, రాజ్య రక్షణల కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదలడానికి సిద్ధంగా ఉంటారు. అలాంటి సైనికుల సంక్షేమం చూడాల్సిన బాధ్యత ప్రభువుదే. అందులోనూ ప్రాణత్యాగం చేసిన వీర సైనికుల కుటుంబాలకు నిరంతరం కూడు గుడ్డలకు లోటు రానీయకుండా చూసుకోవడం, వారిని సంతోషపరచడం రాజు యొక్క ధర్మం అని చెపుతూ

"అనఘా! నీ ప్రస్తవమున
నని నీల్గిన వీరభటుల యనుపొష్యుల నె
ల్లనుబ్రోతె భోజనాచ్ఛా
దనముల వారలకు నెమ్మి దఱుగక యుండన్

"పుణ్యాత్ముడైన ఓ ధర్మరాజా! నీ కొరకు యుద్ధంలో మరణించిన వీరసైకుల కుటంబాలకు కూడు గుడ్డలు లోటు లేకుండా ఇచ్చి వాళ్ళ సంతోషం తగ్గకుండా పోషిస్తున్నావు కదా!" అని అడుగుతాడు.

కుటుంబానికి ఆధారంగా, యజమానిగా ఉన్న సైనికుడు మరణిస్తే ఆ సైనిక కుటుంబ అవసరాలు తీర్చే సైనిక సంక్షేమ కుటుంబ పింఛను పథకం వంటిది మహాభారతకాలంలోనే ఉన్నట్లు పై పద్యం వలన తెలుస్తుంది.

## వ్యవసాయాభివృద్ధి - రైతు, వ్యాపార సంక్షేమం:

రాజు ఎంత గొప్పవాడైనా, రాజ్యం ఎంత ధనవంత మైనదైనా రాజ్యంలో ప్రజలకు ఆహారం ముఖ్యం. ఆహారం సమృద్ధిగా ఉండాలంటే పంటలు బాగా పండాలి. పంటలు బాగా పండేటందుకు అనావృష్టి లేకుండా నీరు పుష్కలంగా ఉండాలి. వర్ష రూపంగా లభించే నీరు ప్రవాహధర్మంగా ఉంటుంది. అందువలన వర్షపు నీటిని ఒడిసిపట్టి చెఱువుల్లో నిలువ చేయగలిగితే వ్యవసాయ అభివృద్ధి జరుగుతుంది. అందుకనే ప్రస్తుతం ప్రభుత్వాలు వివిధ ప్రాజెక్టుల ద్వారా నదులకు అనకట్టలు, రిజర్వాయర్లు, చెఱువులు నిర్మించి నీటిని నిలువ చేస్తూ, సంరక్షిస్తూ వ్యవసాయాభివృద్ధికి ప్రయత్నిస్తున్నారు. ఆ అవసరాన్ని గుర్తు చేస్తూ

ధరణీనాథ ! భవద్భు జ
పరిపాలితయైన వసుధ బరిపూర్ణములై
కర మొప్పచున్నె చెఱువులు
ధరణి కవగ్రహ భయంబు దనుకకయుండన్

"ఓ ధర్మరాజా! భుజబలంతో నీవు పరిపాలిస్తున్న ఈ భూమిలో అనావృష్టి భయం లేకుండా చెఱువులు నిండి కనుల పండువుగా ఉన్నాయి కదా! అని అడుగుతాడు.

ప్రస్తుత ప్రజాస్వామ్య యుగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా వ్యవసాయం చేస్తున్న రైతులకు పలు సంక్షేమ పథకాల ద్వారా సహాయం చేస్తున్నాయి. అంతేకాదు వివిధ బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి ఋణాలు కూడా అందిస్తున్నారు. అలాగే వివిధ వ్యాపారాలు చేసే, పరిశ్రమలు నిర్వహించే వారికి ఋణాలు కూడా అందిస్తున్నారు. వీటి వల్ల (విత్తనాలు వ్యవసాయ ఉపకరణాలు కూడా అందిస్తున్నారు) వ్యవసాయి వ్యాపార అభివృద్ధి కలిగి దేశాభివృద్ధి సాధ్య మవుతుంది. అయితే ఈ సంక్షేమం యొక్క మూలాలు భారత కాలంలో ఎలా ఉన్నాయో పరిశీలిస్తే

"హీనులగు కర్షకులకును
భూనుత! ధాన్యంబు బీజములు, వణిజులకున్
మానుగ శతైకవృద్ధిన
నూనముగా ఋణములిత్తె యుత్తమ బుద్ధిన్"

"ఓ ధర్మరాజా! పేదవారైన కర్షకులకు దాన్యపు విత్తనాలు, వర్తకులకు నూటికి ఒక రూపాయి వడ్డీ వంతున (సంవత్సరానికి!) ఋణాలు ఇస్తున్నావు కదా !" అని నారదుడు ధర్మరాజును అడుగుతాడు.

అధిక ఆహార ఉత్పత్తికి మంచి విత్తనాలు ఉండాలి. అలాగే ఆర్థికాభివృద్ధికి వ్యాపారాదులు బాగా సాగాలి. వీటికోసం రాజులు ఉదారబుద్ధితో వ్యవహరించాలి. ఇలా వ్యవహరించడం మహాభారతకాలంలోనే ఉన్న విషయం పై పద్యం వల్ల మనకు అర్థమవుతుంది.

## వికలాంగుల సంక్షేమం :

సమాజంలో అందరూ సకలాంగులే కాదు. వికలాంగులు కూడా ఉంటారు. కుంటి, గ్రుడ్డి, మూగ వంటి అంగ విహీనులు, మానసిక వికలాంగులు వీరితో పాటు అనాథలు. వీరంతా సమాజంలో భాగమే. వీరిని ప్రభుత్వం పోషించాలి. ఆ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా నిర్వహిస్తూ వారి మన్ననలు పొందే ప్రయత్నాన్ని చేస్తున్నాయి. అయితే ఈ సంక్షేమం ఆధునిక ప్రజాస్వామ్య యుగంలోనేకాదు. మహాభారతకాలంలోనూ ఉందనే విషయం క్రింది పద్యం ద్వారా తెలుస్తుంది.

"పంగుల మూకాంధుల విక
లాంగులను నబాంధవుల దయం బ్రోతె? ...
.........................................................
.........................................................

"ధర్మరాజా! కుంటివాళ్ళను, మూగవాళ్ళను, గ్రుడ్డి వాళ్ళను, అంగవిహీనులైనవాళ్ళను, వీరితో పాటు 'నా' అన్నవారులేని అనాథలు, వీరిని దయతో పోషిస్తున్నావు కదా! ....... అని అంటాడు. దీనిలో ప్రభువులు చేసే సహాయం దయార్ద్రతతో కూడా ఉండాలనే విషయం గమనార్హం.

## ఉద్యోగుల నియామకం మరియు పోషణ :

మన భారతదేశం కేంద్ర, రాష్ట్ర, స్థానిక వ్యవస్థలుగా ప్రజలకు పరిపాలన నందిస్తుంది. ఈ పరిపాలన సజావుగా సాగేందుకు ఉద్యోగులు అవసరం. కాబట్టి తమ అవసరాలకు తగిన విధంగా వ్యవస్థలు ఉద్యోగులను నియమించుకొని వారి ద్వారా వ్యవస్థను నడుపుతుంటారు. ఇలా నియమించుకొనే ఉద్యోగులకు నియమాల కనుగుణంగా జీత భత్యాలు ఇస్తుంటారు. ఈ ఇచ్చే జీవభత్యాలు సకాలంలో ఇవ్వాలనే విషయం మహాభారతంలో...

"ఉత్తమ మధ్యమాధమ నియోగ్యత బుద్ధి నెఱింగి వారి న
య్యుత్తమ మధ్యమాధమ నియోగములన్ నియమించితే నరేం
ద్రోత్తమ! భృత్యకోటికి సమానముగా దగు జీవితంబు లా
యత్తము సేసి యిత్తె దయ నయ్యయి కాలము దప్పకుండగన్"

"ధర్మరాజా! వ్యక్తుల ఉత్తమ మధ్యమాధమ యోగ్యతలను తెలుసుకొని వాళ్ళను అయా ఉత్తమ మధ్యమాధమ ఉద్యోగాల్లో నియమించావు కదా! సేవకులందరికీ కొరత లేకుండా దయతో సకాలంలో తగిన జీతాలు అందచేస్తున్నావు కదా!" అని నారదుడు ధర్మరాజును అడుగుతాడు. దీనిలో యోగ్యతానుగుణంగా ఉద్యోగులను నియమించుకోవాలనే విషయంతోపాటు దయతో సమయం తప్పకుండా ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలనే విషయాన్ని మనం గమనించవచ్చు.

లోకంలో ఎక్కడయినా అది ప్రభుత్వ (ప్రైవేటు) వ్యవస్థ ఏదైనా ఉద్యోగులు తాము పనిచేసిన కాలానికి తగిన జీతం పొందడం న్యాయం. ఒకవేళ ఆ న్యాయానికి భంగం కలిగితే ఆ వ్యవస్థలు నడుపుతున్న వ్యక్తులు వారు ఎంతవారైనా దేవేంద్రుడంతటి శక్తివంతుడైనా - వైభవం కలిగినవాడైనా - (తన దగ్గర పనిచేస్తున్న సేవకులు పొందవలసిన సమయంలో జీతాన్ని పొందక బాధపడుతుంటే) అటువంటి వారి దారిద్ర్య దుఃఖం అవ్యవస్థను నడుపుతున్న వ్యక్తికి కీడును చేస్తాయంటూ

తమతమ కనియెడు తఱి జీ
తము గానక నవయు భటుల దౌర్గత్య విషా
దము లేలిన వాని కవ
శ్యము నెగ్గొనరించు నతడు శక్రుండైనన్ అని

అంటాడు. ఈ విషయాన్ని అందరూ గుర్తించాల్సిందే.

పైవిషయాలన్నీ గమనించినప్పుడు పై సామాజిక సంక్షేమ పథకాలకు మూలాలు మహాభారతాది గ్రంథాలలో ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తే, ప్రాజ్ఞ నిరంకుశత్వానికి పేరెన్నిక గన్న రాజరిక వ్యవస్థలో ఉండడం ఆలోచనల్ని కలిగిస్తుంది. అందుకే అన్నారు "యదిహాస్తి

తదన్యత్ర యన్నే హాస్తి, నతత్ క్వచిత్' - ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించి భారతంలో ఉన్నదే లోకంలో (సమాజంలో) ఉన్నది. భారతంలో లేనిదేదీ లోకంలో లేదు.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్రమహాభారతం వ్యాఖ్యానం - తి.తి.దే. ప్రచురణలు.

●●●